సాక్షి
సిద్దిపేట
శనివారం । 25 । జనవరి । 2025



గాజులపల్లి టూ ఢిల్లీ

తెలుగు భాష మీద ఉన్న అభిమానం యువకుడిని సిద్దిపేట డిగ్రీ కళాశాల నుంచి ఢిల్లీ దాక నడిపించాయి. వివరాలు 10లో ▸



వివక్ష రూపుమాపాలి

సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. వివరాలు 10లో ▸



టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకుని నైపుణ్యాన్ని చాటాలని ప్రొఫెసర్ అనిత అన్నారు. వివరాలు 10లో ▸

ప్రగతి పరుగు.. వసతులు మెరుగు

అభివృద్ధి బాటలో మున్సిపాలిటీలు ● ఈనెల 26తో ముగుస్తున్న పాలక వర్గాల గడువు

జిల్లాలోని మున్సిపాలిటీలు ప్రగతి బాట పట్టాయి. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పాలకులు చర్యలు చేపట్టారు. నిధుల కొరత వల్ల కొన్ని ముఖ్యమైన పనులు పూర్తి చేయలేకపోయామనే అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలక వర్గాల గడువు ఈ నెల 26తో ముగుస్తుండటంతో వారు సాధించిన ప్రగతిపై ఆయా చైర్మన్, చైర్‌పర్సన్‌లతో 'సాక్షి' ముఖాముఖి..



అవార్డుల పంట.. పర్యాటకం ముంగిట



హుస్నాబాద్: 'ప్రగతిలో మున్సిపాలిటీ ఆదర్శంగా నిలుస్తోంది. నిధుల వెల్లువతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నాం. స్వచ్ఛ సర్వేక్షన్ కింద మున్సిపాలిటీ నాలుగు సార్లు జాతీయ, రెండు రాష్ట్ర స్థాయి అవార్డులను సొంతం చేసుకుంది. పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగా సౌకర్యాల మెరుగుకు విశేష కృషి చేశాం' అని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత 'సాక్షి'తో అన్నారు. 'ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట వరకు జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌వే లైన్‌కు రూ.88 కోట్లు మంజూరయ్యాయి. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు రూ.18 కోట్లు మంజూరు కాగా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. కొత్త చెరువు అభివృద్ధికి రూ.10 కోట్లు, ఆరపల్లె చెరువుకు రూ.1.50 కోట్లు ప్రతిపాదనలు పంపాం. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో రూ.2కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రూ.10కోట్ల వ్యయంతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ఐదేళ్ల పరిపాలన సంతృప్తిని ఇచ్చింది. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ప్రజల సహకారంతో హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అనుకున్న దానికంటే ఎక్కువ అభివృద్ధి చేశాం. అని' అని రజిత అన్నారు.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్ పర్సన్, హుస్నాబాద్

గుర్తింపు తెచ్చా.. అభివృద్ధి సాధించా



దుబ్బాక: 'మున్సిపాలిటీ ఆవిర్భావం తర్వాత మొదటి చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు ప్రజలకు సేవచేసే అదృష్టం దక్కడం నా జీవితంలో మరిచిపోలేను. అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశాను. ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చా..' అని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి 'సాక్షి'తో అన్నారు. 'పట్టణంలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించాం. ఇళ్లు లేని వెయ్యి మంది పేదలకు డబుల్‌బెడ్రూం ఇచ్చి సొంతింటి కలను నిజంచేశాం. రూ.4.5 కోట్లతో అధునాతన హంగులతో మోడల్‌బస్టాండ్, రూ.1.70 కోట్లతో స్మృతివనం నిర్మించాం. పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతో చాలా మందికి ఉపాధితోపాటు మున్సిపాలిటీకి ఆదాయం ఏర్పడింది. వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జిమ్‌లతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాం. తన హయాంలో రెవిన్యూ డివిజన్, రింగ్‌రోడ్డు ఏర్పాటు కాకపోవడంపై తీవ్ర నిరాశగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.10 కోట్ల నిధులు ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది. పనులు ముందుకు సాగకపోవడంతో ఇబ్బందిగా మారింది. మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే ప్రభాకర్ సహకారంతో హామీలను నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉంది. మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరవలేను' అని వనితారెడ్డి అన్నారు.

– గన్నె వనితారెడ్డి, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్

అందరి సహకారం.. స్వచ్ఛతలో ఆదర్శం



గజ్వేల్: మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనతోపాటు స్వచ్ఛతలో ఆదర్శంగా నిలబెట్టగలిగామని, అన్నివర్గాల సహకారం వల్లే ఇది సాధ్యమయ్యిందని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. ఈనెల 26తో పదవీ కాలం ముగియనున్న సందర్భంలో శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంలో పట్టణంలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. ప్రధానంగా డంప్ యార్డును పూర్తి చేయగలిగామని తెలిపారు. అలాగే ఇళ్ల వద్ద నుంచి వ్యర్థాలను శుద్ధి చేసి కంపోస్ట్‌గా తయారు చేసే వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. రూ.156కోట్ల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామన్నారు. పట్టణాన్ని స్వచ్ఛతలో ఆదర్శంగా నిలబెట్టడంతో 2022–23 సంవత్సరానికి దక్షిణ భారత దేశంలో 'స్వచ్ఛ సర్వేక్షన్' అవార్డు సాధించి..రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్ల కోసం రూ.170కోట్లతో ప్రతిపాదనలు పంపితే కేవలం రూ.22.87కోట్లు మాత్రమే వచ్చాయని, దీంతో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లను పూర్తి చేయలేకపోయామనే అసంతృప్తి ఉందని అభిప్రాయపడ్డారు. కొన్ని కారణాల వల్ల రింగు రోడ్డు, బస్టాండ్‌ల నిర్మాణం పూర్తికాక పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. సుందరీకరణ కూడా పూర్తిస్థాయిలో చేయలేకపోయామని తెలిపారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల సహకారం ఎప్పటికీ మరిచిపోలేనని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి వ్యాఖ్యానించారు.

– ఎన్సీ రాజమౌళి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్

న్యూస్‌రీల్

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



అమరవీరుల జ్యోతిని వెలిగించి యాత్రను ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): అమరవీరుల పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మండలంలోని బైరాన్‌పల్లి బురుజు వద్ద జ్యోతిని వెలిగించి సీపీఎం రాష్ట్ర మహాసభల యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలే లక్ష్యంగా పోరాటం సాగిస్తామన్నారు. సంగారెడ్డిలో జరగనున్న మహాసభలను విజయవంతం చేద్దామన్నారు. ఈ బహిరంగ సభల్లో సీపీఎం పార్టీ ముఖ్యులు పాల్గొంటున్నారని అన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

జిల్లా ఎంవీఐ శంకర్ నారాయణ



రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న శంకర్ నారాయణ

కొండపాక(గజ్వేల్): ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించుకోగలుతామని జిల్లా ఎంవీఐ శంకర్ నారాయణ అన్నారు. దుద్దెడలోని టోల్ ప్లాజా వద్ద జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నారాయణ మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాన్ని నడపొద్దని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలను వెంట పెట్టుకోవాలన్నారు. అంతకు ముందు కొండపాక ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. టోల్ ప్లాజా సిబ్బందితో పాటు వాహనదారులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు.

బీపీ, షుగర్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: గ్రామీణ ప్రజల్లో బీపీ, షుగర్ నియంత్రణపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి టెస్టులు నిర్వహించాలని సూచించారు.

నిలదీతలు.. నిరసనలు

ముగిసిన గ్రామ సభలు

- అధికారులపై ఆగ్రహజ్వాల
- అనర్హులకే ఇస్తున్నారంటూ మండిపాటు
- పలు పథకాల కోసం 89,166 మంది దరఖాస్తు
- రేషన్ కార్డులకే అధికం

సాక్షి, సిద్దిపేట: ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు రసాభాస మధ్య ముగిశాయి. ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రారంభిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, కొత్తగా రేషన్ కార్డుల అందజేత సందర్భంగా పట్టణాలు, పల్లెల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 633 సభలను నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం ముసాయిదా జాబితాలను ప్రదర్శించారు. ఈ సభలు 50శాతానికి పైగా నిరసనల మధ్యనే కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా పలు పథకాల కోసం 89,166 మంది దరఖాస్తు చేశారు.

ఎన్నిమార్లు దరఖాస్తు చేయాలంటూ..

'ఏడాది క్రితం నిర్వహించిన ప్రజాపాలనలో, మీ సేవలో, ప్రజావాణిలో దరఖాస్తు చేశాం. సమగ్ర సర్వేలో మాకు రేషన్ కార్డులు, ఇళ్లు లేవని చెప్పాం. అధికారులకు దరఖాస్తులను ఇచ్చాం. తీరా జాబితాల్లో మా పేర్లు లేవు' అంటూ చాలా మంది ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులే ఎక్కువ మంది ఉన్నారని గొడవకు దిగారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా సభలు సాగాయి. మరికొన్ని చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనలు సైతం ఉన్నాయి. పలు చోట్ల పోలీసుల పహారా నడుమ సభలు జరిగాయి. దుబ్బాకలో ఇల్లు మంజూరు చేయలేదని ఓ యువకుడు టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మద్దూరు మండలం నర్సయపల్లి సభలో కాంగ్రెస్ జనగామ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతుండగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు.



పొట్లపల్లి సభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాల్సిందే..

హుస్నాబాద్‌రూరల్: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలంటూ శుక్రవారం పొట్లపల్లిలో జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు అధికారులకు నిలదీశారు. ఆత్మీయ భరోసా కూలీలకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా నిరుపేదలకే సంక్షేమ పథకాలు అదించాలని అన్నారు. అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, పేదలకు అన్యాయం చేయవద్దన్నారు. ఆత్మీయ భరోసా చాలా మంది కూలీ కుటుంబాలకు రాలేదని అన్నారు. మహ్మదాపూర్, పందిల్ల, జిల్లెలగడ్డ గ్రామాల్లో గ్రామ సభల్లో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ రమేశ్, ఎంపీఓ నాగరాజు అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకే..

వార్డు, గ్రామ సభలలో రేషన్ కార్డులకే అధికంగా దరఖాస్తులు వచ్చాయి. రేషన్ కార్డుల కోసం 52,304 దరఖాస్తులు రాగా అందులో రూరల్‌లో 37,709, అర్బన్ ప్రాంతాల్లో 14,595 వచ్చాయి. రేషన్ కార్డులు ఇప్పటికే 16,491 కొత్తగా మంజూరు అవుతున్నట్లు ఆయా గ్రామ సభలలో ప్రకటించారు. రేషన్ కార్డుల కోసం ఎన్నిమార్లు దరఖాస్తు చేయాలని దరఖాస్తు దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 28,113 దరఖాస్తులు రాగా రూరల్ ప్రాంతాల్లో 21,485, అర్బన్ ప్రాంతంలో 6,628 మంది చేశారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి రెండు సీజన్‌లకు రూ12వేల ఇవ్వాలని నిర్ణయించారు. సాగు యోగ్యంకాని భూములను ఇప్పటికే గుర్తించారు. రైతు భరోసాకు 13,042 మంది రైతులు దరఖాస్తు చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12వేలు ఇచ్చేందుకు ఆత్మీయ భరోసా పథకంను అమలు చేస్తున్నారు. ఇప్పటికే 18వేల మంది పైగా వ్యవసాయ కూలీలను ఎంపిక చేయగా మరో 7,407 మంది దరఖాస్తు చేశారు.



వెల్లువలా దరఖాస్తులు

వివిధ కారణాల వల్ల వార్డు సభల్లో దరఖాస్తులు ఇవ్వలేని వారి కోసం మున్సిపల్ కమిషనర్ ఆశ్రితకుమార్ బల్దియాలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. దీంతో పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తులు అందజేస్తున్నారు.

–సిద్దిపేటజోన్

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు రాలేదని..

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

- మంత్రి కొండా సురేఖ హామీ ఇస్తేనే దిగుతానంటూ హల్‌చల్
- దుబ్బాకలో తీవ్ర ఉత్కంఠ

దుబ్బాక: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర మన స్తాపానికి గురైన ఓ యువకుడు సెల్‌టవర్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. శుక్రవారం దుబ్బాకలో ఈ ఘటన చోటుచేసుకుంది. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట 11 వ వార్డుకు చెందిన మామిడాల రాజు ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు పెట్టుకున్నాడు.ఈ క్రమంలో లచ్చపేటలో నిర్వహించిన వార్డుసభలో లబ్ధిదారుల జాబితా చదవగా తన పేరు లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తు ఆందోళన చేశాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాజు దుబ్బాకకు చేరుకొని సెల్‌టవర్ ఎక్కాడు. పెద్దగా కేకలు వేస్తూ మంత్రి కొండా సురేఖ వచ్చి తనకు ఇల్లు ఇస్తానని హామీ ఇస్తేనే దిగుతానని, లేదంటే దూకి చస్తానంటూ బెదిరించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గంగరాజు పోలీసులతో అక్కడికి చేరుకొని కిందకు దిగాలని ఎంతగా నచ్చజెప్పినా వినలేదు. చివరకు మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ వచ్చి తప్పకుండా నీకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో 2 గంటల తరువాత కిందకు దిగాడు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం రాజుకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏది ఏమైన ఈ సంఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.



కిందకు దిగిన రాజుతో మాట్లాడుతున్న అధికారులు



సెల్‌టవర్ పైన రాజు

ఐటీ హబ్‌కు ఇంటర్నెట్ పునరుద్ధరణ

'సాక్షి' కథనాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్

సిద్దిపేటఅర్బన్: ఐటీ హబ్‌లో మూడు రోజులుగా నిలిచిన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 'ఐటీ హబ్‌కు ఇంటర్నెట్ కట్' అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. టీజీఐఐసీ అధికారులతో మాట్లాడి పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. అలాగే మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం 'సాక్షి' కథనానికి సంబంధించిన క్లిప్పింగ్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కొత్త కంపెనీల సంగతి దేవుడెరుగు, ఉన్న కంపెనీలు పోకుండా చూడండి' అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడంతో ఉద్యోగులు ఐటీ హబ్ నుంచే విధులు నిర్వహించారు.



విధులు నిర్వహిస్తున్న ఐటీ ఉద్యోగులు

హుస్నాబాద్‌కు రింగ్ రోడ్

- వచ్చే జనవరిలోగా ఏర్పాటు చేసి తీరుతాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పట్టణానికి రింగ్ రోడ్ ఏర్పాటు చేసి తీరుతామని, వచ్చే జనవరిలోగా పూర్తి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని గాంధీ చౌరస్తాలో గాంధీ జంక్షన్, శివాజీ నగర్‌లోని సుందరీకరణ జంక్షన్‌ను మంత్రి ప్రారంభించారు. పొన్నం మాట్లాడుతూ మారుతున్న అవసరాలకు అనుగుణంగా పట్టణాన్ని సుందరీకరణ చేస్తామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామన్నారు. చౌటపల్లి ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లకు నిధులు కేటాయించి పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వచ్చే నెల నుంచి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం వట్టిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా అల్పాహారం(స్నాక్స్) అందించడానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రత్యేక తరగతులు సైతం తీసుకోవలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. టెన్త్ అత్యంత కీలకమని, అశ్రద్ధ చేయవద్దన్నారు. చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపార్ కోసం అవస్థలు

కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల అగచాట్లు

- పనులు మానుకొని కేంద్రాల వద్ద పడిగాపులు
- ఈనెలాఖరు వరకే సమయమిచ్చిన పాఠశాలలు

అపార్ కోసం .. విద్యార్థుల తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. పనులు మానుకుని, ఉదయాన్నే ఆధార్ సెంటర్లకు చేరుకుంటున్నారు. స్కూల్‌లో, ఆధార్‌లో వివరాలు ఒకేలా ఉండాలంటూ మార్పులు చేర్పుల కోసం పాఠశాల యజమాన్యాలు ఈనెలాఖరు వరకు అవకాశం ఇచ్చాయి. అలాగే రేషన్‌కార్డులోనూ పేరు చేర్పించాల్సి ఉంది. మరోవైపు ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి సైతం ఆధార్ అనుసంధానించడంతో రద్దీ నెలకొంది.

సాక్షి, సిద్దిపేట : జిల్లావ్యాప్తంగా 27 ఆధార్ నమోదు కేంద్రాలున్నాయి. మీసేవా 16, బ్యాంక్‌ల్లో బయోమెట్రిక్ సెంటర్లు 10, పోస్టాఫీస్‌లో ఒకటి ఉన్నాయి. దీంతో సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల పట్టణాలకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఆధార్ కార్డులు సవరణకు, కొత్తవి దరఖాస్తు చేసుకునేందుకు రోజంతా సమయం కేటాయిస్తున్నామని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ కోసం..

కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో నమోదు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నమోదు ప్రక్రియ ఆయా పాఠశాలల్లో కొనసాగుతోంది. విద్యార్థి పేరు, పుట్టిన తేదీతో కూడిన వివరాలు పాఠశాలలో, ఆధార్ కార్డులో ఒకేలా ఉండాలి. లేకుంటే నమోదు కావడం లేదు. దీంతో పాఠశాలలో బోనఫైడ్ సర్టిఫికెట్లు తీసుకుని ఆధార్ కేంద్రాల్లో సవరించుకుంటున్నారు. ఈనెల చివరి వరకే అపార్ నమోదు చేస్తామని పాఠశాల యాజమాన్యాలు పేర్కొనడంతో ఆధార్‌లో వివరాలు తప్పుగా ఉంటే సరిచేసుకునేందుకు పరుగులు తీస్తున్నారు.



హుస్నాబాద్‌లో యూనియన్ బ్యాంక్ ఆధార్ నమోదు కేంద్రంలో కిక్కిరిసిన ప్రజలు

ఉచిత బస్సు ప్రయాణానికి లింకు

ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. ఎప్పుడో దిగిన ఫొటోలతో పాటు ఆంధ్రప్రదేశ్ అని కార్డులో ఉండటంతో అప్‌డేట్ చేయించుకోవాలని కండక్టర్‌లు సూచిస్తున్నారు. ఫొటో స్పష్టంగా కనిపించకపోవడంతో బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుతించడం లేదు. తెలంగాణ రాష్ట్రం అని మార్చుకునేందుకు, ఫొటో అప్‌డేట్ చేసుకునేందుకు సైతం ఆధార్ అవసరం. దీంతో ఈ కేంద్రాల వద్ద రద్దీ కనిపిస్తోంది. కొన్ని కేంద్రాల్లో టోకెన్ పద్ధతిని ప్రవేశ పెడుతున్నారు. రద్దీ దృష్ట్యా మరిన్ని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు వదిలిపెట్టి వచ్చా



కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేయాలంటే మా పిల్లలకు ఆధార్ కావాలి. నా చిన్న కుమారుడి ఆధార్ నమోదు కోసం వచ్చాం. పేరు నమోదు చేశారు. ఇంకా ఫొటో దిగాల్సి ఉంది. కార్డు నంబర్ కావాలి. అందుకే ఎంత సమయమైనా నమోదు కోసం పనులున్నా పక్కన పెట్టి వచ్చాం.

– నవీన్, నారాయణరావుపేట

క్లుప్తంగా

మగ్దుంపూర్ వాసికి డాక్టరేట్

నంగునూరు(సిద్దిపేట): ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మగ్దుంపూర్ వాసి అచ్చిన పోషాద్రికి డాక్టరేట్ వరించింది. మహారాష్ట్రలోని మార్వాడా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రో బయోటిక్ ప్యాక్డ్ ఫుడ్‌పై పరిశోధన చేయడంతో డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. శుక్రవారం నిర్వహించిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

వీఓఏ ప్రవీణ్‌కు సుభాష్ చంద్రబోస్ లైఫ్ టైమ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రవీణ్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ మహిళా సంఘాల వీఓఏగా పని చేస్తున్న ప్రవీణ్‌కు నేతాజీ సుభాష్ చంద్రబోస్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్ కళావేదిక మీద కొమ్మూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. 18 ఏళ్లుగా మహిళా సంఘాలకు నిరంతరాయంగా చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును రావడం సంతోషంగా ఉందని ప్రవీణ్ అన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు


పతకాలతో నర్సింలు

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఎ.నర్సింలు జాతీయ స్థాయిలో నిర్వహించే రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ముంబాయి, హైద్రాబాద్‌లో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో మొదటి బహుమతులు గెలుచుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక కావడంపై ఎంఈఓ ప్రభుదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జానకీరామ్, సత్యనారాయణ ఉపాధ్యాయుడిని అభినందించారు.

షేర్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

రూ.13.58 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్ : నకిలీ షేర్ మార్కెట్ పేరిట ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఉద్యోగికి గతేడాది నవంబర్ 28న వాట్సప్ ద్వారా షేర్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. బాధితుడు తనకు వచ్చిన లింక్‌లో వివరాలను నమోదు చేశాడు. సైబర్ నిర్వాహకులు అతడికి ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. వెంటనే ఆ ఉద్యోగి ఆన్‌లైన్‌లో కొంత నగదు పెట్టుబడి పెట్టాడు. మొత్తంగా రూ.13.58 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. చివర గా ఉద్యోగి తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితులు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గాజులపల్లి టూ ఢిల్లీ

- జాతీయస్థాయిలో మెరిసిన దుబ్బాక మండలం యువకుడు
- నేషనల్ యూత్ ఫెస్ట్‌కు హాజరు
- ప్రధాని, కేంద్ర మంత్రులతో ముఖాముఖి
- రాష్ట్రం తరఫున వికసిత్ భారత్‌కి ఎంపిక
- మహమ్మద్ షాదుల్‌కి అభినందనల వెల్లువ


షాదుల్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ (ఫైల్)

దుబ్బాకటౌన్: బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు, తండ్రి మరణించిన అనంతరం తల్లి బీజన్ బీ, మేనమామ చాంద్ పాషా ప్రోత్సాహంతో తన విద్యాభ్యాసం పూర్తి చేశాడు. మరో వైపు తెలుగు భాష మీద ఉన్న అభిమానం, ఉపన్యాసంపై ఉన్న ప్రేమ సిద్దిపేట డిగ్రీ కళాశాల నుంచి ఢిల్లీ దాక నడిపించాయి. ఇంతింతై వటుడింతయై అన్నట్టు ఒక్కో మెట్టు ఎదుగుతూ గాజులపల్లి నుంచి దేశ రాజధాని ఢిల్లీ దాక అలుపెరుగని ప్రయాణం చేశాడు. వికసిత్ భారత్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ప్రధాని, కేంద్ర మంత్రులతో సమావేశం అయ్యే అవకాశం పొందాడు. అంతటి ఘనత సాధించిన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన యువకుడు షాదుల్ గురించి సాక్షి ప్రత్యేక కథనం....

ఆ బిరుదే స్ఫూర్తితోనే తెలుగుపై మక్కువ

సికింద్రాబాద్‌లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తి చేసిన షాదుల్ ప్రస్తుతం తెలుగు భాష మీద ఉన్న మమకారంతో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంఏ తెలుగు దూర విద్యను అభ్యసిస్తున్నాడు. గాజులపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ రెడ్డి షాదుల్ విద్యకు, హాస్టల్ , కోచింగ్ ఉన్నత చదువులకు చేదోడు వాదోడుగా నిలిచారు. జాతీయ స్థాయి వరకు వెళ్లడానికి షాదుల్‌కి స్తోమత లేక పోవడంతో ఆయనే ఆర్థిక సహకారం అందించాడు. షాదుల్ పదవ తరగతిలో తన గురువు, కవి నార్లపురం రాములు నుండి మొలదారం లేని మొగోడు అనే బిరుదు పొందాడు. ఆ బిరుదే ఈ రోజు తనకు తెలుగు భాషపై మక్కువ పెంచిందని షాదుల్ చెప్పారు .

పలు వేదికల్లో ఉపన్యాసం

- 2015 ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి యువత రంగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.
- 2017 నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికై.. అప్పటి గవర్నర్ నర్సింహన్ ఎదుట ఉపన్యాసం ఇచ్చాడు.
- 2018 ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరఫున యువ తరంగం కార్యక్రమానికి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు..
- 2018 రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో గెలుపొంది నగదు పురస్కారం అందుకున్నాడు.


షాదుల్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

మరువలేని అనుభూతి



నేషనల్ యూత్ ఫెస్టివల్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇస్రో చైర్మన్ డా.వీ నారాయనాన్, మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కేంద్ర మంత్రివర్యులు మనసుఖ్ మండవ్య, కిషన్ రెడ్డిలతో సమావేశాల్లో పాల్గొనడం మరువలేని అనుభూతి నింపింది. వారి సందేశాలు నన్ను చాలా ఉత్తేజపరిచాయి. భవిష్యత్‌లో మంచి స్థాయిలో స్థిరపడి మా అమ్మ, మామ కష్టానికి ప్రతిఫలం అందిస్తాను.

–షాదుల్, యువకుడు, గాజులపల్లి

మోదీ, కేంద్ర మంత్రులతో ముఖాముఖి

2024 నవంబర్ నెలలో ప్రధాని మోదీ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్–2025 కార్యక్రమం ప్రవేశపెట్టారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో యువత నైపుణ్యతను వెలికి తీయడం. 26 ఏళ్ల ఉన్న అతడి ప్రసంగాన్ని మోదీ ఆలకించారు. చివరగా పది అంశాల్లో 500 మందికి వారి ఆలోచనలను మోదీ సమక్షంలో వ్యక్తం చేసే అవకాశం కల్పించారు. అందులో సిద్దిపేట జిల్లా నుంచి షాదుల్ ఒకరవడం విశేషం. రాష్ట్రం నుంచి కార్యక్రమానికి 18 మంది పాల్గొన్నారు. మారుమూల గ్రామం గాజులపల్లి నుంచి ఢిల్లీ వరకు వెళ్లి ఆధునిక భారతదేశ అభివృద్ధిలో తన ఆలోచన వ్యక్తపరిచిన మహమ్మద్ షాదుల్‌ను గ్రామస్తులు సన్మానించి హర్షం వ్యక్తం చేశారు.



ప్రధాని మోదీ సమక్షంలో ప్రసంగిస్తున్న షాదుల్

హత్యాయత్నం కేసులో ముగ్గురు రిమాండ్

రాయికోడ్(అందోల్): ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిపిన కేసులో ముగ్గురిని శుక్రవారం పోలీసులు రిమాండ్ చేశారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు కథనం మేరకు.. రాయికోడ్‌లోని ఓ ప్రార్థన మందిరం సమీపంలో గ్రామానికి చెందిన సామెల్‌పై రాయికోడ్‌కు చెందిన నవరత్నం, ఏసురత్నం, మార్థమమ్మలు పాత కక్షలతో మారణాయుధాలతో సామేల్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన సామేల్ భార్య స్వరూపపై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన దంపతులను జహీరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. సామేల్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌లోని ఉస్మానియాకి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. సామేల్ సోదరుడు జైరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూపీసీ శ్రావణి, సిబ్బంది, శివకుమార్, సంగారెడ్డి, అశోక్, నాగరాజులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హన్మంతు

డ్యూటీకని వెళ్లి యువకుడు అదృశ్యం


దీప్ మాన్న

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్‌కి చెందిన అమర్ కుమారుడు దీప్ మాన్న (26) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. 21న ఉదయం డ్యూటీ కి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం దీప్ మాన్న తల్లి సోమ మాన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గౌతమ్ నగర్‌కు చెందిన యువతి


సోనీ

యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్‌కు చెందిన మనోజ్ కుమార్ కూతురు కుమారి సోనీ ప్రైవేటు జాబ్ చేస్తుంది. రోజు మాదిరి గురువారం రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించింది. శనివారం ఉదయం లేచి చూసేసరికి కుమారి సోనీ కనిపించలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తండ్రి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోళ్ల దాణాతో వెళ్తున్న లారీ దగ్ధం


దగ్ధమవుతున్న వాహనాలు

పటాన్‌చెరు టౌన్: లారీ దగ్ధమైన ఘటన ఓఆర్ఆర్‌పై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్ర నుంచి విశాఖపట్నంకి లారీ కోళ్ల దాణాతో వెళ్తుంది. శుక్రవారం ఉదయం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ రహదారిపైకి రాగానే టైర్ల రాపిడితో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ కిందికి దిగిపోయాడు.

కారు ఢీకొట్టడంతో బైక్..

హత్నూర(సంగారెడ్డి): బైక్‌ను కారు ఢీకొట్టడంతో బైక్ దగ్ధమైన ఘటన హత్నూర మండలం పల్పనూరు గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి బోరుపట్ల గ్రామానికి చెందిన కాసాల చిరంజీవి(28) పెట్రోల్ కోసం బైక్‌పై వెళ్తుండగా పల్పనూరు శివారులో సంగారెడ్డి నుంచి నర్సాపూర్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగి బైక్ పూర్తిగా కాలిపోయింది. గాయపడిన చిరంజీవిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.


చోరీ కేసులో ఆరు నెలలు జైలు

కోహెడ(హుస్నాబాద్): చోరీ కేసులో ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. 2024 మార్చిలో పెద్దమ్మ ఆలయంలో బస్వాపూర్‌కు చెందిన బోదాసు యాదగిరి, మద్దూర్ మండలం దూల్మిట్టకు చెందిన ఆలెపు శేఖర్ బంగారు, వెండీ ఆభరణాలు, నగదు చోరీ చేశారు. గ్రామానికి చెందిన పొన్నం అంజయ్య ఫిర్యాదు మేరకు దొంగలను అరెస్ట్ చేశాం. జ్యుడిషల్ రిమాండ్‌కు తరలించగా కేసు కొనసాగుతుంది. ఇద్దరు నిందితులపై శుక్రవారం నేరం రుజువు కావడంతో హుస్నాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణతేజ ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. నేరస్తులకు శిక్ష పడడానికి కృషి చేసిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు, ఎస్ఐ అభిలాష్, పీసీ సంజీవ్‌లను సిద్దిపేట సీపీ అనురాధ, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ శ్రీనివాస్ అభినందించినట్లు తెలిపారు.

రైలులో నుంచి కిందపడి తీవ్రగాయాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైలులో నుంచి కిందపడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తెల్లాపూర్, లింగపల్లి రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకుంది. కొల్లూరు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన సలీం గురువారం సికింద్రాబాద్‌కు వచ్చేందుకు కర్ణాటక రాష్ట్రంలోని సేడం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. గురువారం రాత్రి తెల్లాపూర్ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రైలులో నుంచి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సలీంను ఆస్పత్రికి తరలించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో సలీం రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి.

ఆది మానవుల రాతి చిత్రాలు లభ్యం


రేఖా చిత్రాలను చూపుతున్న సంతోష్

కొల్చారం/పాపన్నపేట(నర్సాపూర్): కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు లైబ్రేరియన్ బుర్ర సంతోష్ పాపన్నపేట మండలం నాగ్సాన్పల్లి ఏడు పాయల వనదుర్గ సన్నిధికి వెళ్లే మార్గంలోని గుట్టల్లో ఆది మానవుల రాతి చిత్రాలను గుర్తించినట్లు తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ రాతి చిత్రాల్లో రంగు నింపిన పెద్దబొమ్మ, ఒక చేప, మచ్చల జంతువులు, పెద్ద సూర్యుడు, ఎముకలు, రెండు కంగారు వంటి జంతువులు, మాస్కు ధరించిన ఒక పెద్ద మానవరూపం, వజ్రాకార డిజైన్ వంటి పలు చిత్రాలను గుర్తించారు. ఈ రాతి చిత్రాల శైలి, ఎరుపు రంగులో చిత్రించబడ్డ పద్ధతి చూస్తే వీటి కాలం మధ్య రాతియుగంగా గుర్తించవచ్చని రాతి చిత్రాల నిపుణుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సలహాదారుడు బండి మురళీధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

లింగ ఆధారిత వివక్ష రూపుమాపాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి
- బాలికల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

సిద్దిపేటకమాన్: సమాజంలో లింగ ఆధారిత వివక్షను రూపుమాపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కోర్టు నుంచి విక్టరీ చౌరస్తా వరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో బాలికల హక్కులు, ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడానికి జాతీయ బాలిక దినోత్సవాన్ని ప్రతి ఏడాది జనవరి 24న జరుపుకుంటున్నట్లు తెలిపారు. బాలికలకు విద్య, ఆరోగ్య సంరక్షణ, భద్రత కోసం మెరుగైన అవకాశాలను అందజేయాలని తెలిపారు. బాల్య వివాహాలు, లింగ పక్షపాతం, విద్య లేమితో సహ భారతదేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతలు, సవాళ్ల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి, న్యాయమూర్తులు చందన, తరణి, అదనపు కలెక్టర్ హమీద్, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు రాజలింగం, పత్రి ప్రకాశ్, భరోసా, షీ టీమ్, సఖీ సెంటర్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, ప్రభుత్వ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి


ఇన్ఫోసిస్ కార్యాలయం వద్ద డిగ్రీ కళాశాల విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకొని తమలోని నైపుణ్యాన్ని చాటాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం సూచించారు. మహిళా కళాశాల విద్యార్థినులు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులు, ట్రైనర్లతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో కెరియర్‌కు అవసరమైన అంశాలు, రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌పై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని తమలోని ప్రతిభను చాటాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లక్ష్మీ, అధ్యాపకులు సరోజన, సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు


క్రీడా జట్టుకు బహుమతి అందజేస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఖోఖోలో జీఎంఆర్ గజ్వేల్, కబడ్డీలో జీపీటీసీ సిద్దిపేట, వాలీబాల్‌లో రత్నపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ పటాన్‌చెరు నిలిచాయి. టేబుల్ టెన్నిస్ డబుల్స్, సింగిల్స్‌లో జీఎంఆర్ గజ్వేల్, బ్యాడ్మింటన్ డబుల్స్, సింగిల్స్‌లో రత్నపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ పటాన్‌చెరు, చెస్‌లో ఎస్ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ జహీరాబాద్‌లు నిలిచాయి. అదే విధంగా బాలికల విభాగంలో కబడ్డీలో జీపీటీడబ్ల్యూ మెదక్, ఖోఖోలో జీపీటీ సిద్దిపేట, వాలీబాల్‌లో జీపీటీ సిద్దిపేట, బ్యాడ్మింటన్‌లో జీపీటీ సిద్దిపేట, టేబుల్ టెన్నిస్‌లో జీపీటీ సిద్దిపేట, చెస్‌లో జీపీటీడబ్ల్యూ మెదక్‌లతో పాటు అథ్లెటిక్స్‌లో సైతం గెలుపొందిన క్రీడా జట్లకు గజ్వేల్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడా పోటీల్లో ఆయా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆరుగురి అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ శివారు చెరువు కట్ట వద్ద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,954 నగదు, 6 మొబైల్ ఫోన్లు, 5 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వర్గల్(గజ్వేల్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కెనాల్‌లో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం సింగాయపల్లి వద్ద శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం చెన్‌వాడ జిల్లా సమాజ్‌వాడి గ్రామానికి చెందిన వికాస్(26) కొంత కాలం నుంచి గౌరారం సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి చేపల వేట కోసం సింగాయపల్లి సమీప కెనాల్‌కు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కెనాల్‌లో మునిగి మృతి చెందాడు. సాయంత్రం కెనాల్‌లో మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు.

ట్యాంకర్‌ను ఢీకొని యువకుడు

సిద్దిపేటఅర్బన్: ట్యాంకర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన తాళం కమలాకర్‌రెడ్డి (28) సిద్దిపేటలోని ఎల్‌జీ షోరూంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. బూరుగుపల్లి గ్రామ శివారులోకి రాగానే జాతీయ రహదారి పనులకు వినియోగిస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- రూ.2.38కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నూతన రిజర్వాయర్ నుంచి మంచినీటి సరఫరా ప్రారంభం


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, తదితరులు

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డి పేట, పటేల్ గూడ, సుల్తాన్ పూర్,ఐలాపూర్, ఐలాపూర్ తాండ, దయారా పరిధిలో రూ.2.38కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పటేల్‌గూడ పరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్ నుంచి మంచి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరిని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. అనంతరం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జస్ట్ డయల్, పేటీఎం, టెక్ మహీంద్రా సంస్థలు నిర్వహించిన జాబ్‌మేళా ముగింపు కార్యక్రమానికి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నూ ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు జాబ్‌మేళాను నిర్వహించడం సంతోషదగ్గ పరిణామం అన్నారు. కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, జలమండలి జీఎం సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.